సాక్షి ఒడిశా
గురువారం । 19 । సెప్టెంబర్ । 2024





శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం బుధవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.3,44,038లు, వచ్చాయని అధికారులు తెలిపారు.

## ఉపాధ్యాయుడిపై ఫిర్యాదు



తనను వేధిస్తున్నాడని ఆరోపిస్తూ ఆశ్రమ పాఠశాలకు చెందిన ఉపాధ్యాయుడిపై అదే పాఠశాలలో వంట మనిషిగా పనిచేస్తున్న మహిళ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది.

- 8లో



## మాజీ సైనికుల ఆందోళన

ఆర్మీ మేజర్ గురువంత్ సింగ్, అతని స్నేహితురాలు అంకిత ప్రధాన్‌పై పోలీసుల అభ్యంతరకర ప్రవర్తన నేపథ్యంలో మాజీ సైనిక వర్గాలు ఆందోళనకు దిగారు.

- 8లో

## న్యూస్‌రీల్

### ఎమ్మెల్యే సనాతన్‌పై కేసు కొట్టివేత



సనాతన్ మహాకుడు

భువనేశ్వర్: చంపువా నియోజకవర్గం ఎమ్మెల్యే సనాతన్ మహాకుడుపై నమోదైన కేసును హైకోర్టు కొట్టివేసింది. ఇటీవల ముగిసిన సార్వత్రిక ఎన్నికల్లో సనాతన్ మహాకుడు అక్రమాలకు పాల్పడ్డారనే ఆరోపణతో రాష్ట్ర హైకోర్టులో కేసు దాఖలు అయింది. ఆయన ప్రత్యర్థి గురు బక్సింగ్ అహ్లువాలియా ఈ కేసు దాఖలు చేశారు. ఎన్నికల అక్రమాలకు సంబంధించిన ఆరోపణలతో కేసుల దాఖలు గడువు ముగిసిన తర్వాత ఈ కేసుని దాఖలు చేసినట్లు రాష్ట్ర హైకోర్టు గుర్తించింది. ఈ నేపథ్యంలో కేసుని కొట్టివేసినట్లు ధర్మాసనం స్పష్టం చేసింది.

### గంజాయి స్వాధీనం



గంజాయి స్వాధీనం చేసుకుంటున్న అధికారులు

రాయగడ: స్థానిక రైల్వేస్టేషన్ వద్ద అనుమానాస్పదంగా కనిపించిన ఒక వ్యక్తిని ఆపి తనిఖీ చేయగా అతని వద్ద 20.320 కిలోల గంజాయి పట్టుబడింది. వివరాల్లోకి వెళ్తే.. బుధవారం ఎక్సైజ్ శాఖ అధికారులు ఎప్పటిలాగే పెట్రోలింగ్ నిర్వహించారు. ఆ సమయంలో రైల్వేస్టేషన్ వద్ద అనుమానంగా కనిపించిన వ్యక్తిని తనిఖీ చేయగా గంజాయి పట్టుబడింది. ఈ మేరకు నిందితుడిని అదుపులోకి తీసుకుని కోర్టుకు తరలించారు.


### నాటుసారా స్వాధీనం



నాటుసారాతో నిందితులు

రాయగడ: సదరు సమితి బాయిసింగి గ్రామంలో ఎక్సైజ్ అధికారులు బుధవారం నిర్వహించిన దాడుల్లో 10 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు ముగ్గురు నిందితులను అరెస్టు చేసి కోర్టుకు తరలించారు. గత కొద్దిరోజులుగా నాటుసారా తయారీ కేంద్రాలపై విస్తృతంగా దాడులు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో బాయిసింగి నుంచి అక్రమంగా నాటుసారా తరలిస్తున్న ముగ్గురిని పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ ఎస్పీ సంజయ్ ప్రధాన్ వెల్లడించారు.

### నూతన బ్లడ్ బ్యాంక్ ప్రారంభం



నూతన బ్లడ్‌బ్యాంక్ వద్ద వైద్య సిబ్బందితో ఎంపీ బలభద్ర తదితరులు

మల్కన్‌గిరి: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వాస్పత్రి ఆవరణలో నూతన బ్లడ్ బ్యాంక్‌ను నవరంగ్‌పూర్ ఎంపీ బలభద్ర మాఝీ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అత్యవసర సమయాల్లో అవసరమైనవారికి ఇకపై అందుబాటులో ఈ నూతన బ్లడ్ బ్యాంక్ ఉంటుందన్నారు. ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి ధనేశ్వర్ మహాపాత్రో, కలెక్టర్ ఆశిష్ ఈశ్వర్ పటేల్, మలకన్‌గిరి ఎమ్మెల్యే నర్సింగ్ మడ్కమి, చిత్రకొండ ఎమ్మెల్యే మంగుఖీలో తదితరులు పాల్గొన్నారు.

### కొటియాలో నేత్ర వైద్య శిబిరం



నేత్ర వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యుడు

జయపురం: కొరాపుట్ జిల్లా పొట్టంగి సమితి కొటియ గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని బుధవారం నిర్వహించారు. దీనిలో భాగంగా మొత్తం 42 మందికి వైద్య పరీక్షలు జరిపినట్లు నిర్వాహకులు వెల్లడించారు. వారిలో 11 మందికి కాటరాక్ట్ ఉన్నట్లు గుర్తించారు. అలాగే ఆరుగురికి కళ్లద్దాలు సమకూర్చారు. అలాగే ఒక కేసుని మెరుగైన చికిత్స కోసం రిఫర్ చేసినట్లు వెల్లడించారు. రోగులకు ఉచితంగా మందులు, కళ్లద్దాలు అందజేశారు. పొట్టంగి కమ్యూనిటీ ఆస్పత్రి అధికారి డాక్టర్ భగవత్ ముర్ము పర్యవేక్షణలో నిర్వహించిన శిబిరంలో నేత్ర వైద్య నిపుణులు బిజయ కుమార్ ఆచార్య, బీపీఎం రశ్మిత స్వాన్, పీహెచ్ఈవో ఆరతీ గుడియ పాల్గొన్నారు.

# వారం దాటినా... వీడని వరద..!





అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

- వరద ముంపులో ఉత్తర ఒడిశా
- ఇటీవల కురిసిన వర్షాలతో సతమతం
- నదుల్లో ప్రమాదస్థాయి దాటిన నీటిమట్టం

భువనేశ్వర్: రాష్ట్రంలో వాయుగుండం ప్రభావంతో వర్షాలు కురిసి వారం రోజులు గడిచినా ఇంకా వరద వీడడం లేదు. ఉత్తర ఒడిశా వరదల్లో కొట్టుమిట్టాడుతోంది. వేలాది హెక్టార్ల పంట పొలాలు వరద ముంపునకు గురయ్యాయి. సాధారణ జనజీవనం ప్రభావితమైంది. పలుచోట్ల రహదారులపై నడుము లోతు నీరు ప్రవహిస్తోంది. నిత్యావసరాల కోసం ప్రజానీకం పడవలో రాకపోకలు చేస్తున్నారు. ప్రాంతీయ జిల్లా కలెక్టర్ క్షేత్రస్థాయి వరద పరిస్థితిని తరచూ సమీక్షిస్తున్నారు.

**ఏరియల్ సర్వే**

వరద ఉధృతి పెరగడంతో ముఖ్యమంత్రి మోహన్ మాఝీ బుధవారం వరద ముంపు ప్రాంతాల్లో ఏరియల్ సర్వే చేపట్టారు. ప్రధానంగా బాలాసోర్ జిల్లా వరద ముంపులో మునిగి తేలుతుంది. సుమారు 6 మండలాల్లో 8 వేల హెక్టార్ల పంట పొలాలు వరద నీట మునిగాయి. బలియాపాల్, జలేశ్వర్, భోగొరాయ్ 3 మండలాల్లో 35 గ్రామ పంచాయతీలు జల దిగ్బంధంలో చిక్కుకున్నాయని ముఖ్యమంత్రి తెలిపారు.

**సమీక్ష సమావేశం**

అనంతరం బాలాసోర్ జిల్లాలో వరద పరిస్థితిపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ముఖ్యమంత్రితో కేంద్ర మాజీమంత్రి, ఎంపీ ప్రతాప్ చంద్ర షడంగి, రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి డా.ముఖేష్ మహాలింగ్, స్థానిక ఎమ్మెల్యే పద్మలోచన్ పండా, ప్రభుత్వ డిప్యూటీ చీఫ్ విప్ గోవింద్ చంద్ర దాస్ తదితరులు పాల్గొన్నారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో ప్రభావిత వర్గాలకు అన్ని సౌకర్యాలు ప్రధానంగా తలదాచుకునేందుకు సురక్షిత ఆశ్రయంతో ఆహారం, ఆరోగ్యం వంటి మౌలిక సౌకర్యాలు కల్పించాలని అధికారులకు ఆదేశించారు. నీటి ముంపు దిగుముఖం కావడంతో సహాయక, పునరుద్ధరణ పనుల్ని యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలన్నారు.

**ఉప్పొంగుతున్న నదులు**

మరోవైపు వర్షాల కారణంగా సువర్ణ రేఖ, బుధాబొలాంగొ, జలకా నదులు గరిష్ట నీటిమట్టం దాటి ఉప్పొంగుతున్నాయి. దీంతో తీర ప్రాంతాల ప్రజలు బిక్కుబిక్కుమంటున్నారు. ప్రమాద సంకేతం దాటి సువర్ణ రేఖ, జలకా నదులు ప్రవహిస్తున్నాయని జల వనరుల విభాగం చీఫ్ ఇంజినీర్ విజయ్ సామల్ తెలిపారు. సువర్ణ రేఖ నీటిమట్టం ప్రమాద సంకేతం అధిగమించడంతో బాలేశ్వర్ జిలాల్లోని 4 మండలాలు వరదకు ప్రభావితం అయ్యాయి. వీటిలో బలియాపాల్, జలేశ్వర్, భోగొరాయ్ మరియు బొస్తా ప్రాంతాలు ఉన్నాయి. మరో రోజు వరకు ఈ నదుల్లో నీటి మట్టం ప్రమాదకర పరిమితిలో ఉప్పొంగే అవకాశం ఉంది.



ఏరియల్ సర్వే నిర్వహిస్తున్న సీఎం మోహన్‌చరణ్

### ఆహారం పంపిణీ

బాలాసోర్ జిల్లా యంత్రాంగం వరద బాధితులకు మౌలిక సదుపాయాలు కల్పిస్తోంది. లోతట్టు ప్రాంతాల నుంచి 2,000 మంది ప్రజలను పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన సురక్షిత ఆశ్రయ కేంద్రాలకు తరలించింది. ఈ కేంద్రాల్లో బాధితులకు ఆహారాన్ని పంపిణీ చేస్తున్నారు. వరద కోతతో బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిన ప్రజానీకం బాగోగుల పర్యవేక్షణ కోసం 8 యూనిట్ల అగ్నిమాపక దళం, 3 యూనిట్ల ఒడ్రాఫ్, 1 యూనిట్ ఎన్డీఆర్ఎఫ్ బృందం సభ్యులు రంగంలో సేవలు అందిస్తున్నారు.



ఇంటిపైకి ఎక్కి ప్రాణాలు నిలుపుకున్న ప్రజలు



వరద బాధితులను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్న దృశ్యం



సమీక్షలో పాల్గొన్న అధికారులు

# బైక్‌ల చోరీ కేసులో నిందితుల అరెస్టు



పోలీసుల అదుపులో ఉన్న నిందితులు

రాయగడ: బైక్‌ల చోరీ కేసులో గుణుపూర్ పోలీసులు ఐదుగురి నిందితులను అరెస్టు చేశారు. వీరి నుంచి 8 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. అరెస్టైనవారిలో జిల్లాలోని కల్యాణ సింగుపూర్ సమితి అజాబడి గ్రామానికి చెందిన రవీంద్ర కౌసల్య, మునిగుడ సమితి పరిధిలోని కుడులిమ గ్రామానికి చెందిన గౌరి శంకర్ బెహుర , కల్యాణ సింగుపూర్‌కు చెందిన దేవా హియాల్, కలహండి జిల్లాలోని కెందుగుడ గ్రామానికి చెందిన సంగ్రాం కేసరి సాహు, బంకకందురు గ్రామానికి చెందిన సచితానంద సాహులు ఉన్నారు. గుణుపూర్ ఎస్డీపీవో బబిలి నాయక్, ఆదర్శ పోలీస్‌స్టేషన్ ఐఐసీ ఉత్తమ్ కుమార్ సాహులు బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఈ మేరకు వివరాలు తెలియజేశారు. ఈనెల 13వ తేదీన లక్ష్మణగుడ ప్రాంతానికి చెందిన లక్ష్మీకాంత్ సబర్ అనే వ్యక్తి తన స్నేహితుడితో సమీపంలోని నారాయణగుడ గ్రామానికి బైక్‌పై వెళ్లాడు. ఈ క్రమంలో బైక్‌ను రోడ్డు పక్కన పార్కింగ్ చేసి తన పనులను పూర్తిచేసి తిరిగి వచ్చాడు. అయితే అప్పటికే తన బైక్ కనిపించకపోవడంతో వెంటనే గుణుపూర్ ఆదర్శ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. ఈ నేపథ్యంలో ఈనెల 17వ తేదీన గుణుపూర్‌లో పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తున్న సమయంలో రవీంద్ర కౌసల్య, గౌరి శంకర్ బెహుర అనే ఇద్దరు వ్యక్తులు బైక్‌పై వెళ్తుండడం గమనించిన పోలీసులు ఆ మేరకు వారిని ఆపి బైక్‌కు సంబంధించి కాగితాలను చూపించమని చెప్పారు. అందుకు వారి వద్ద ఎటువంటి కాగితాలు లేకపోవడంతో పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లి విచారించగా నిజం బయటపడింది. గౌరి శంకర్, రవీంద్రలు బైకులను దొంగతనం చేసి ఇతరులకు విక్రయిస్తుంటారని విచారణలో తేలడంతో బైక్‌లను ఖరీదు చేసే దేవా హియాల్, సంగ్రాం కేసర సాహు, సచితానంద సాహులను పోలీసులు అరెస్టు చేశారు.



నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న బైక్‌లు

## సత్తాచాటిన మీనా శాంత



బంగారు పతకంతో మీనా శాంత

జయపురం: ఫిజీలో జరుగుతున్న వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో నబరంగ్‌పూర్ జిల్లాకు చెందిన మీన శాంత సత్తాచాటింది. ఆమె పలు విభాగాల్లో రెండు బంగారు పతకాలు, ఒక వెండి పతకం గెలిచింది. మీనా శాంత నవరంగపూర్ జిల్లా ఉమ్మరకోట్ సమీపంలోని కురుమహండి గ్రామానికి చెందిన కాశు శాంత, పులసీ శాంతల కుమార్తె. ఇదివరకే పలుమార్లు జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో సత్తాచాటింది. దీంతో ఆమెను పలువురు అభినందిస్తున్నారు.

## పికప్ వ్యాన్ బోల్తా



అదుపుతప్పిన పికప్ వ్యాన్



మహిళను చికిత్స కోసం తరలిస్తున్న దృశ్యం

- 9 మందికి గాయాలు

మల్కన్‌గిరి: జిల్లాలోని కోరుకొండ సమితి దుడుమేట్ల పంచాయతీ బాలకటి గ్రామం వద్ద మంగళవారం రాత్రి ఒక పికప్ వ్యాన్ అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో 9 మందికి తీవ్ర గాయాలయ్యాయి. దీంతో స్థానికులు అంబులెన్స్‌కు సమాచారం అందజేసి కోరుకొండ ఆరోగ్య కేంద్రానికి క్షతగాత్రులను తరలించారు. వారిలో పరిస్థితి విషమంగా ఉన్నటువంటి ఐదుగురిని మలకన్‌గిరి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మహిళలంతా సుభద్ర యోజన కార్యక్రమం కోసం కోరుకొండ సమితి కార్యాలయానికి వచ్చి సాయంత్రం సొంత పనులు చూసుకొని తిరిగి వెళ్తున్న సమయంలో ప్రమాదం జరిగింది. అయితే వ్యాన్ డ్రైవర్ ప్రస్తుతం పరారీలో ఉండడంతో అతడిపై కేసు నమోదు చేసి పోలీసులు గాలిస్తున్నారు.

# ప్రభుత్వం మారింది.. పనితీరు మార్చుకోండి

- వాడీవేడిగా జిల్లా పరిషత్ సమావేశం
- అధికారులపై మండిపడిన ప్రజాప్రతినిధులు



సమీక్షా సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

రాయగడ: రాష్ట్రంలో ప్రభుత్వం మారిందని, ఇకపై అధికారులు కూడా పనితీరు మార్చుకోవాల్సి ఉంటుందని కొరాపుట్ లోక్‌సభ ఎంపీ సప్తగిరి ఉలక, రాయగడ ఎమ్మెల్యే అప్పలస్వామి కద్రకలు అన్నారు. స్థానిక డీఆర్‌డీఏ సమావేశ మందిరంలో జిల్లా పరిషత్ సమీక్ష సమావేశం వాడీవేడిగా బుధవారం జరిగింది. ఈ మేరకు ప్రజా ప్రతినిధులు అధికారుల తీరుపై మండిపడ్డారు. జిల్లాలో సమస్యలు విలయతాండవం చేస్తున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడని ఆవేదన వ్యక్తం చేశారు. రహదారులు, తాగునీటి సమస్యలు ప్రతీ గ్రామంలో ఎన్నో ఉన్నాయన్నారు. కాసీపూర్, చంద్రపూర్ వంటి సమితుల్లో అత్యధిక శాతం గ్రామాలకు ఇప్పటికీ సరైన రహదారులు లేకపోవడంతో అత్యవసర పరిస్థితుల్లో ప్రజలు అవస్థలు పడుతున్నారన్నారు. వచ్చే నిధులు సక్రమంగా ఖర్చు చేయాలని స్పష్టం చేశారు. ఇప్పటికైనా అధికారులు తమ తీరు మార్చుకోకపోతే సహించేది లేదని హెచ్చరించారు. అలాగే వైద్యుల పోస్టులను భర్తీ చేసేందుకు ప్రభుత్వానికి నివేదిక సమర్పించాల్సిన ఆవశ్యకత వైద్యశాఖ అధికారులకు ఉందని గుర్తు చేశారు.

**విద్యా వ్యవస్థలోనూ సమస్యలు**

జిల్లాలో విద్యా వ్యవస్థలోనూ సమస్యలు పేరుకుపోయాయని ఎమ్మెల్యే అప్పల స్వామి కద్రక ఆవేదన వ్యక్తం చేశారు. నిర్మాణ దశలో ఉన్న పాఠశాలలను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. అదే విధంగా ఇప్పటికే జిల్లాలో ఉపాధ్యాయుల కొరత వేధిస్తుంటే, ప్రస్తుతం ఉన్న ఉపాధ్యాయులను డిప్యూటేషన్ పేరిట ఇతర ప్రాంతాలకు బదిలీ చేయడం ఎంతవరకు సమంజసమని దుయ్యబట్టారు. విద్యా వ్యవస్థను మరింత పటిష్టం చేయాలని, అలాగే ఉపాధ్యాయులు తమ విధులను సక్రమంగా నిర్వర్తించాలని కోరారు.

**పాత్రికేయులకు అనుమతివ్వాలి**

ప్రజా ప్రతినిధులు, అధికారులు నిర్వహిస్తున్న ప్రతీ సమీక్ష సమావేశాలకు విలేకరులు తప్పకుండా హాజరయ్యే విధంగా అధికారులు అనుమతులివ్వాలని ఎమ్మెల్యే కద్రక అన్నారు. ప్రతీ సమీక్షా సమావేశంలో విలేకరులు కేవలం ఫొటోలు తీసి బయటకు వెళ్లిపోవాలని చెబుతున్న జిల్లా యంత్రాంగం వైఖరిని మార్చుకోవాలని అన్నారు. ప్రజల కోసం అమలు చేసే ప్రతీ సంక్షేమ పథకానికి సంబంధించి నిర్వహించే సమీక్షా సమావేశంలో పాత్రికేయుల పాత్ర చాలా ఉంటుందని పేర్కొన్నారు. పాత్రికేయులను సమావేశాలకు రాకుండా ముందస్తుగా జారీ చేస్తున్న సమాచారాన్ని ఇకపై నిలిపివేయాలని సూచించారు. ఒకవేళ పాత్రికేయులను అడ్డుకుంటే ఇకపై తాము కూడా సమావేశాలకు హాజరయ్యేది లేదని తేల్చిచెప్పారు. జిల్లా పరిషత్ అధ్యక్షురాలు సరస్వతి మాఝి అధ్యక్షతన జరిగిన సమావేశంలో కలెక్టర్ ఫరూల్ పట్వారి, సబ్ కలెక్టర్ కల్యాణి సంఘమిత్రా దేవి, బిసంకటక్ ఎమ్మెల్యే నీలమాధవ హికక, గుణుపూర్ మున్సిపల్ వైస్ చైర్మన్ శివప్రసాద్ గౌడో తదితరులు పాల్గొన్నారు.

## జగన్నాథుడి సన్నిధిలో గవర్నర్



రాష్ట్ర గవర్నర్ రఘుబర దాస్ పూరీ శ్రీజగన్నాథ మందిరాన్ని బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా శ్రీమందిరం రత్న వేదికపై కొలువుదీరిన చతుర్ధామూర్తులకు ప్రత్యేక పూజార్చనలు నిర్వహించారు. లోక కల్యాణం కోసం స్వామిని ప్రార్థించినట్లు తెలిపారు.

- భువనేశ్వర్

## క్లుప్తంగా

### డీజీపీ పదవీ కాలం పొడిగింపు

భువనేశ్వర్: రాష్ట్ర పోలీసు డైరెక్టర్ జనరల్ యోగేష్ బహదూర్ ఖురానియా పదవీ కాలం పొడిగించారు. ఈ మేరకు రాష్ట్ర హోం శాఖ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. 2026 సంవత్సరం ఆగస్టు 16వ తేదీ వరకు ఆయన ఈ హోదాలో నిరవధికంగా కొనసాగుతారని ఉత్తర్వులు పేర్కొన్నాయి. దీంతో డీజీపీ హోదాలో ఖురానియా 2 ఏళ్లు నిరవధికంగా కొనసాగేందుకు వీలు కల్పించారు.

### గంజాయి పట్టివేత



గంజాయితో పట్టుబడిన నిందితుడు

రాయగడ: స్కూటీలో అక్రమంగా తరలిస్తున్న 22.270 కిలోల గంజాయిని చందిలి పోలీసులు పట్టుకున్నారు. దీనికి సంబంధించి గుడారికి చెందిన నరేంద్ర పలక అనే వ్యక్తిని అరెస్టు చేసి కోర్టుకు తరలించారు. బుధవారం చందిలి పోలీస్‌స్టేషన్ పోలీసులు లేకపాయి గ్రామ కూడలిలో వాహన తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో అటువైపుగా వస్తున్న ఒక స్కూటీని ఆపి తనిఖీ చేయగా అందులో గంజాయి పట్టుబడింది.

### వరి సేకరణ సరళీకరణ



సమీక్ష సమావేశం నిర్వహిస్తున్న సీఎం మోహన్‌చరణ్

భువనేశ్వర్: రాష్ట్రంలో వరి సేకరణ వ్యవస్థ, కార్యాచరణపై ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి మంగళవారం ప్రత్యక్షంగా సమీక్షించారు. ఈ సందర్భంగా వరి సేకరణ వ్యవస్థని సరళీకరించాలని, ఈ మేరకు మార్గదర్శకాలు సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. రైతుల అభ్యున్నతి, సాధికారిత బలోపేతానికి వరి సేకరణ సరళీకరణ దోహదపడుతుందని అధికారులకు తెలిపారు.

### వరద పరిస్థితిపై సమీక్ష

భువనేశ్వర్: రాష్ట్రంలో ప్రధానంగా ఉత్తర ఒడిశాలో వరద ఉధృతిని జల వనరుల విభాగం ప్రముఖ కార్యదర్శి, అభివృద్ధి కమిషనర్ అనూ గర్గ్ సమీక్షించారు. ఎగువ ప్రాంతం, పొరుగు రాష్ట్రం ఝార్ఖండ్ జల వనరుల విభాగం కార్యదర్శి ప్రశాంత కుమార్‌తో వరద నీటి ప్రవాహానికి సంబంధించి సమీక్షించారు. రాజ్‌ఘాట్ ప్రాంతంలో సువర్ణ రేఖ నీటిమట్టం నిలకడగా కొనసాగుతుంది. గురువారం నుంచి తగ్గుముఖం పట్టే అవకాశం ఉన్నట్లు భావిస్తున్నారు. అలాగే జలకా, బుధాబొలాంగొ నదుల నీటి మట్టం ప్రమాద పరిమితి దిగువకు తగ్గుముఖం పట్టినట్లు అధికారులు వివరించారు. పరిస్థితిని అనుక్షణం పరిశీలిస్తు ఉండాలని బాలాసోర్ జిల్లా అధికారులకు ఆదేశించారు.

### భక్తిశ్రద్ధలతో కుంకుమ పూజలు

జయపురం: పట్టణంలోని మహాత్మాగాంధీ రోడ్డులో నిర్వహిస్తున్న బాల గణపతి సంఘం వినాయక పెండాల్‌లో బుధవారం భక్తిశ్రద్ధలతో కుంకుమ పూజలు జరిగాయి. ఈ పూజల్లో వందలాది మంది మహిళలు పాల్గొన్నారు. అలాగే జయపురం జైలు రోడ్డులో వినాయక విగ్రహాన్ని నిమజ్జనం చేశారు.

### అలరించిన నృత్య పోటీలు



సంబల్‌పురి నృత్య ప్రదర్శన



నృత్య పోటీలకు విచ్చేసిన కళాకారులు

పర్లాకిమిడి: ఒడియా సాంప్రదాయ నువాఖయి పండుగ సందర్భంగా జిల్లా సాంస్కృతిక పరిషత్, సమలై నృత్య పరిషత్ ఆధ్వర్యంలో స్థానిక టౌన్ హాల్‌లో సంబల్‌పురి, ఒడిస్సీ నృత్య పోటీలు బుధవారం నిర్వహించారు. తొలుత శ్రీజగన్నాథ నృత్య పరిషత్ ఆధ్వర్యంలో సంబల్‌పురి నృత్యాన్ని ప్రదర్శించారు. అనంతరం ఉత్తమ నృత్య కళాకారులను సత్కరించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా కలెక్టర్ బిజయకుమార్ దాస్, పురపాలక సంఘం అధ్యక్షురాలు నిర్మలా శెఠి, ఏడీఎం రాజేంద్రమింజ్, సంగీత దర్శకుడు రఘునాథ పాత్రో, జిల్లా సాంస్కృతిక శాఖ అధికారి అర్చనా మంగరాజ్, సమలై నృత్య పరిషత్ కార్యదర్శి బాలకృష్ణ పాణిగ్రాహి పాల్గొన్నారు.

# దారుణం..!



బాలిక మృతదేహం

- మైనర్ బాలికపై అత్యాచారం, హత్య..?
- ఆందోళన చేపట్టిన కుటుంబ సభ్యులు

జయపురం: నవరంగపూర్ జిల్లా తెంతులికుంటి సమితి కొంటాగాం గ్రామంలో ఒక మైనర్ బాలిక అత్యాచారానికి గురై హత్య చేయబడినట్లు తెలుస్తోంది. పోలీసుల వివరాల మేరకు.. కంటాగాం ప్రాథమిక పాఠశాలలో 5వ తరగతి చదువుతున్న 11 ఏళ్ల బాలిక మంగళవారం స్నేహితురాలి ఇంటికి వెళ్లి తిరిగి తమ ఇంటికి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు గాలించారు. పాఠశాల ఆవరణలో నగ్నంగా పడి ఉన్న బాలికను గ్రామస్తులు రాత్రి గమనించి కుటుంబ సభ్యులకు తెలిపారు. అనంతరం వారు పోలీసులకు సమాచారం ఇవ్వగా వారు వచ్చి మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. అయితే బాలికపై అత్యాచారం జరిపి హత్య చేసి ఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు.



సంఘటన స్థలం వద్ద రాజకీయ నేతలు

**ఉద్రిక్త పరిస్థితులు**

ఈ ఘటనతో కొంటాగాం ప్రాంతంలో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు చోటు చేసుకుంది. నిందితులను పట్టుకొని అరెస్టు చేసేంతవరకు తాము బాలిక మృతదేహాన్ని తీసుకెళ్లేది లేదని కుటుంబ సభ్యులు, గ్రామస్తులు ఆందోళన చేపట్టారు. ఈ విషయం తెలిసిన వెంటనే బీజేడీ నేత, మాజీ ఎంపీ ప్రదీప్ మాఝి, సామాజిక కార్యకర్త కాదంబరి త్రిపాఠీ, మాజీ ఎమ్మెల్యే సదాశివ ప్రధాని, కాంగ్రెస్ నేత మున్నా త్రిపాఠీ తదితరులు సంఘటన స్థలానికి వెళ్లి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. వారికి తప్పకుండా న్యాయం జరిగేటట్లు చూస్తామని తెలిపారు. బాలిక మృతదేహంతో తెంతలికుంటి-కొండాగాం మార్గంలో రస్తారోకో జరుపుతున్న కుటుంబ సభ్యులను రాజకీయ నేతలు నచ్చచెప్పి, గ్రామస్తులతో సమావేశం నిర్వహించి పరిస్థితిపై చర్చించారు. దోషులను అరెస్టు చేస్తామని పోలీసులు హామీ ఇవ్వడంతో ప్రజలు శాంతించి ఆందోళన విరమించారు.



మృతదేహం వద్ద విలపిస్తున్న కుటుంబ సభ్యులు

# డాక్టర్ల కొరతతో ఇబ్బందులు

- జిల్లా పరిషత్ సమావేశంలో ప్రజాప్రతినిధులు మండిపాటు



సమీక్ష సమావేశంలో పాల్గొన్న అధికారులు, ప్రజాప్రతినిధులు

పర్లాకిమిడి: జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రిలోని వివిధ విభాగాల్లో డాక్టర్ల కొరత వలన రోగులు బరంపురం, శ్రీకాకుళం ఆస్పత్రులకు వెళ్లాల్సి వస్తోందని మోహనా ఎమ్మెల్యే దాశరథి గొమాంగో ఆరోపించారు. స్థానిక జిల్లా పరిషత్ కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా పరిషత్ సమీక్ష సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. దీనిలో భాగంగా గుమ్మా, కాశీనగర్, ఖోజురిపద, మోహనా పీహెచ్‌సీల్లో పనిచేస్తున్న డాక్టర్లు తరచూ విధులకు గైర్హాజరవుతున్నారని జిల్లా పరిషత్ సభ్యుడు ఎస్.బోడోముండి, పితాంబర్ నాయక్ ఆరోపించారు. కాశీనగర్ పీహెచ్‌సీ నూతన ఆరోగ్య కేంద్రాన్ని ఎందుకు ప్రారంభించడం లేదని జిల్లా పరిషత్ అధ్యక్షుడు గవర తిరుపతిరావు ఆరోపించారు. పర్లాకిమిడి కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రిలో ఇటీవల పాముకాటుతో ఆస్పత్రిలో చేరితే సకాలంలో డాక్టర్ ఇంజెక్షన్ చేయలేకపోవడంతో ఒక బాలిక బలయ్యిందని ఎమ్మెల్యే రూపేష్ పాణిగ్రాహి మండిపడ్డారు.

**పలు పోస్టుల్లో ఖాళీలు**

సమావేశంలో జిల్లా ముఖ్య వైద్యాధికారి డాక్టర్ మహ్మద్ అలీ మాట్లాడుతూ.. గజపతి జిల్లావ్యాప్తంగా 221 నర్సు పోస్టులు, 126 డాక్టర్ల పోస్టులు భర్తీ కాకుండా ఉన్నాయన్నారు. పర్లాకిమిడి కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రిలో 26 మంది మాత్రమే వైద్యులు పనిచేస్తున్నారని సీడీఎంవో డా.ఆలీ తెలిపారు. గజపతిలో మెడికల్ ఆఫీసర్లు 11, చంద్రగిరిలో 9, ఆర్.ఉదయగిరిలో 14, ఖోజురిపద (నువాగడ బ్లాక్)లో 10, గుసాని సమితిలో 12, గుమ్మా సీహెచ్‌సీలో 10, కాశీనగర్ ఎస్‌ఏసీలో 14, పర్లాకిమిడి అర్బన్ పీహెచ్‌సీలో 1 వైద్యుల పోస్టులు ఖాళీగా ఉన్నాయని వెల్లడించారు. అనంతరం వివిధ శాఖలపై సమీక్ష చేపట్టారు. సమావేశంలో కాశీనగర్ సమితి చైర్మన్ బల్ల శాయమ్మ, గుసాని సమితి చైర్మన్ వీర్రాజు, గుమ్మా చైర్మన్ సునేమీ మండల్, కలెక్టర్ బిజయ కుమార్ దాస్, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్య నిర్వాహణ అధికారి గుణనిధి నాయక్, జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ కుంతలా మల్లిక్ తదితరులు పాల్గొన్నారు.

### ఉపాధ్యాయుడిపై ఫిర్యాదు



రామచంద్ర పాఢి (ఫైల్)

రాయగడ: తనను వేధిస్తున్నాడని ఆరోపిస్తూ ఆశ్రమ పాఠశాలకు చెందిన ఉపాధ్యాయుడిపై అదే పాఠశాలలో వంట మనిషిగా పని చేస్తున్న మహిళ పోలీస్‌స్టేషన్‌లో ఈనెల 16వ తేదీన ఫిర్యాదు చేసింది. ఆలస్యంగా అందిన సమాచారం మేరకు జిల్లాలోని చంద్రపూర్ సమితి బుడుబలి గ్రామంలోని ప్రభుత్వ ఆశ్రమ పాఠశాలలో ఈ ఘటన చోటుచేసుకుంది. కేసు నమోదు చేసిన పోలీసులు ఈ మేరకు వివరాలు వెల్లడించారు. ఆశ్రమ పాఠశాలలోని ఉపాధ్యాయుడు రామచంద్ర పాఢి అదే పాఠశాలలో వంట మనిషిగా పనిచేస్తున్న ఒక మహిళను వేధిస్తున్నాడు. ఈ విషయం ఎవరికైనా చెబితే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని ఆ మహిళకు బెదిరిస్తుండేవాడని ఫిర్యాదులో పేర్కొంది. ఉపాధ్యాయుడి వేధింపులు భరించలేని ఆ మహిళ గ్రామంలోని కొందరికి ఈ విషయాన్ని చెప్పింది. అనంతరం గ్రామస్తుల సహకారంతోఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఉపాధ్యాయుడు ప్రస్తుతం పరారీలో ఉన్నట్లు సమాచారం.



ఆశ్రమ పాఠశాల ఇదే

### 80వ రోజుకు కార్మికుల ఆందోళనలు

జయపురం: సమితిలోని గగణాపూర్‌లో ఉన్న సేవా పేపర్ మిల్లు విశ్రాంత కార్మికులు, ప్రస్తుతం పనిచేస్తున్న కార్మికులు మిల్లు ప్రధాన గేటు ముందు జరుపుతున్న ఆందోళనలు బుధవారం నాటికి 80వ రోజుకు చేరుకున్నాయి. వీరు ప్రతిరోజూ తమ డిమాండ్లు నెరవేర్చాలని కోరుతూ నిరసన తెలుపుతున్నారు. అయితే యాజమాన్యం మాత్రం నిమ్మకు నీరెత్తనట్లు వ్యవహరిస్తోందని కార్మిక నేత ప్రమోద్ కుమార్ మహంతి దుయ్యబట్టారు. తమకు యాజమాన్యం చెల్లించాల్సిన బకాయిలు చెల్లించాలని ఆరోపించారు. తమ డిమాండ్లను రాష్ట్ర ముఖ్యమంత్రికి కలిసి విన్నవించుకున్నా, స్థానిక అధికారులు, లేబర్ కమిషనర్‌కు తెలియజేసినా ఫలితం కనిపించడం లేదని వాపోయారు. ఇప్పటికే 36 మంది విశ్రాంత కార్మికులు ఆర్థిక ఇబ్బందులు వలన మృతి చెందగా, వారి కుటుంబాలు సమస్యల సుడిగుండంలో కొట్టు మిట్టాడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కార్మికులకు చెల్లించాల్సిన బకాయిలు చెల్లించాలని, మృతి చెందిన కార్మిక కుటుంబాలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.





ఆందోళన చేపడుతున్న కార్మికులు

# వలస కార్మికుల సమస్యలపై న్యాయ శిబిరం



శిబిరంలో పాల్గొన్న వలస కార్మికులు



మాట్లాడుతున్న కార్మిక విభాగ అధికారి చైతన్య ప్రసాద్

జయపురం:

కొరాపుట్ జిల్లా న్యాయసేవ ప్రదీకరణ సభ్యులు జయపురం సమితి కుములిపుట్ పంచాయతీ కార్యాలయంలో వలస కార్మికుల సమస్యలపై న్యాయ సచేతన శిబిరం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కార్మిక విభాగ అధికారి చైతన్య ప్రసాద్ మాఝీ మాట్లాడుతూ.. ఇతర ప్రాంతాలకు వలస కార్మికులుగా వెళ్లేవారు ముందుగా ప్రభుత్వ కార్మిక అధికారులను కలిసి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. ఎవరైనా ఇతర ప్రాంతాలకు తీసుకెళ్లినప్పుడు వారికి లైసెన్స్ ఉందో లేదో వివరాలు తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఏదైనా కంపెనీ లేదా ఫ్యాక్టరీలో పనికి చేరేటప్పుడు దాని యజమాని పూర్తి వివరాలు కార్మిక విభాగ అధికారులకు తెలియజేయాలని సూచించారు. అలాంటి వారికి పనిచేసేటప్పుడు ఏదైనా ప్రమాదాలు జరిగితే ప్రభుత్వ యంత్రాంగం పూర్తి సహకారం అందించేందుకు అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో జిల్లా న్యాయసేవ ప్రదీకరణ కార్యదర్శి సుమన్ జెన, కుములిపుట్ పీఈవో సునీల్ కుమార్ స్వైన్, సర్పంచ్ సుశీల పెంటియ, దేవేంద్ర కుమార్ కుహార్, పారా లీగల్ స్వచ్ఛంద సేవకుడు రాజపూలక్ మహంతి తదితరులు పాల్గొన్నారు.





ఎవరో వస్తారని ఎదో చేస్తారని ఎదురుచూడకుండా జిల్లాలోని చిత్రకొండ సమితి రాలేగడ పంచాయతీ సికాటపల్లి గ్రామస్తులు ఏకమయ్యారు. గ్రామం వద్ద ఉన్న చిన్న వంతెన ఇటీవల వర్షాలకు కూలిపోవడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఈ విషయాన్ని జిల్లా అధికారులకు తెలియజేసినా పట్టించుకోలేదు. దీంతో గ్రామస్తులంతా కలిసి వెదురు కర్రలతో వంతెన నిర్మాణం చేపట్టారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు. - మల్కన్‌గిరి

### రెండువేల దరఖాస్తులు తిరస్కరణ

భువనేశ్వర్: రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన సుభద్ర యోజన కోసం దాఖలైన 2 వేల దరఖాస్తులు తిరస్కరణకు గురయ్యాయి. బ్యాంకు ఖాతా వివరాల లోపంతో ఈ పరిస్థితి చోటు చేసుకుందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, మహిళ – శిశు అభివృద్ధి శాఖ మంత్రి ప్రతిభా పరిడా బుధవారం తెలిపారు. ఈ పథకం తొలి విడత మొత్తం ఈనెల 17న విడుదల చేసిన విషయం తెలిసిందే. తర్వాత దాఖలైన దరఖాస్తులు పరిశీలించి అర్హులైన వారందరికీ లబ్ధి కలిగించనున్నట్లు ఉద్ఘాటించారు. దళారుల మాయలో పడకుండా జాగ్రత్త వహించాలని ఆమె పిలుపునిచ్చారు.

### తల్లీబిడ్డల మృతదేహాలు లభ్యం

భువనేశ్వర్:

భార్గవి నదిలో తల్లిబిడ్డల మృతదేహాలను వెలికి తీశారు. వివరాల్లోకి వెళ్తే.. పూరీ జిల్లా పిప్పిలి – నిమ్మాపడా మార్గంలో వంతెన పైనుంచి పసికందుని రువ్వేసి తల్లి నదిలోకి దూకిన విషాద సంఘటన స్థానికుల దృష్టికి వచ్చింది. ఈ సమాచారం స్థానిక పోలీసులకు అందజేశారు. అగ్నిమాపక దళంతో పోలీసు వర్గాలు ఘటనా స్థలం ప్రత్యక్షంగా సందర్శించారు. అగ్నిమాపక సిబ్బంది భార్గవి నదిలో గాలించి తల్లీబిడ్డల శవాలను ఒడ్డుకు చేర్చారు. మృతుల వివరాలు తెలియాల్సి ఉంది. పిప్పిలి ఠాణా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

### జయపూర్‌లో సైన్స్ సెమినార్



విజేతలతో పాటు విద్యార్థులు, ఉపాధ్యాయులు

జయపురం: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బ్లాక్ స్థాయి సైన్స్ సెమినార్ బుధవారం నిర్వహించారు. దీంట్లో సమితిలోని పలు ఉన్నత పాఠశాలల నుంచి విద్యార్థులు పాల్గొన్నారు. పాఠశాల హెచ్‌ఎం ప్రకాశ్ పట్నాయక్ అధ్యక్షతన జరిగిన సెమినార్‌లో అంబాగుడ ఉన్నత పాఠశాల విద్యార్థి నాతన్ బెహర ప్రథమ స్థానంలో, ఎకంబా ఉన్నత పాఠశాల విద్యార్థిని రితూ హరిజన్, జయపురం మున్సిపల్ ఉన్నత పాఠశాల విద్యార్థిని అతిథి దాస్‌లు వరుసగా ద్వితీయ, తృతీయ స్థానాలు పొందారు. సెమినార్ న్యాయ నిర్ణేతలుగా విశ్రాంత ఉపాధ్యాయులు సురేంద్ర పట్నాయక్, ఉపాధ్యాయిని ఉమాకాంత బొడపాయి వ్యవహరించారు. కార్యక్రమంలో సోమనాథ్ సారిక, సాగరిక పాత్రో, విశ్వరంజన్ గౌఢ, దుర్గా పాత్ర, హితకర చరిడి, దేవేంద్ర పాడి, పవిత ప్రధాన్ తదితరులు పాల్గొన్నారు.

# మాజీ సైనికుల ఆందోళన

- ఆర్మీ మేజర్‌పై దాడికి నిరసన
- సీబీఐ విచారణ చేపట్టాలని డిమాండ్





ఆందోళన చేపడుతున్న మాజీ సైనికులు

భువనేశ్వర్: ఆర్మీ మేజర్ గురువంత్ సింగ్, అతని స్నేహితురాలు అంకిత ప్రధాన్‌పై పోలీసుల అభ్యంతరకర ప్రవర్తన నేపథ్యంలో మాజీ సైనిక వర్గాలు ఆందోళనకు దిగారు. స్థానిక కమిషనరేట్ పోలీసు కార్యాలయాన్ని బుధవారం ముట్టడించారు. ఠాణాలో పోలీసులు సైన్యాధికారితో పాటు ఆయన సన్నిహితురాలిని చిత్రహింసలకు గురిచేశారని ఆరోపించారు. ఈ చర్యకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు చేపట్టాలని పట్టుబట్టారు. ఈ ఘటనపై సీబీఐ విచారణ లేదా న్యాయ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఇదిలా ఉండగా భరతపూర్ ఠాణాలో ఇన్‌స్పెక్టర్ ఇన్‌చార్జితో 5 మంది సిబ్బంది వ్యతిరేకంగా చర్యలు చేపట్టినట్లు రాష్ట్ర పోలీసు ప్రధాన కార్యాలయం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఠాణా ఇన్‌స్పెక్టర్ ఇన్‌చార్జి దీనకృష్ణ మిశ్రా, సబ్ ఇన్‌స్పెక్టర్ బైశాలినీ పండా, ఏఎస్‌ఐ సలీలమయి సాహు, సాగరిక రథ్, కానిస్టేబుల్ బలరామ్ హంసదాని విధుల నుంచి సస్పెండ్ చేసినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ ఘటనపై క్రైం శాఖ దర్యాప్తు కొనసాగుతుందని రాష్ట్ర పోలీసు డైరెక్టర్ జనరల్ వై.బి.ఖురానియా వెల్లడించారు. బదిలీ లేదా సస్పెన్షన్ అనేది శిక్ష కాదు అని పోలీసు అధికారిపై చట్టపరమైన కఠిన చర్యలు చేపట్టాలని మాజీ సైనికుల వర్గం స్పష్టం చేసింది.

- **ఇదీ విషయం**

గత శనివారం అర్ధరాత్రి మేజర్ గురువంత్ సింగ్ తన స్నేహితురాలితో కలిసి భరత్‌పూర్ ఠాణాకు వెళ్లిన సందర్భంగా పోలీసులు వర్ణనాతీతంగా హింసించినట్లు ఆవేదన వ్యక్తంచేశారు. నడిరోడ్డు మీద అల్లరి మూకల ఆగడాలను తెలియజేసేందుకు వెళ్లిన సందర్భంగా ఈ విచారకర పరిస్థితి చోటు చేసుకుంది. అల్లరి మూకలకు వ్యతిరేకంగా చర్యలు చేపట్టేందుకు స్పందించని ఠాణా అధికారి, సిబ్బంది తమని రాత్రంతా లాకప్‌లో ఉంచారని ఆరోపించారు.

- **బీజేడీ పరామర్శ**

భరత్‌పూర్ ఠాణా పోలీసుల దాడిలో గాయపడిన మేజర్, అతని స్నేహితురాలు అంకిత ప్రధాన్‌ని బిజూ జనతా దళ్ ప్రతినిధుల బృందం పరామర్శించింది. స్థానిక ఎయిమ్స్‌లో ఆమె చికిత్స పొందుతోంది. నగర మేయర్ సులోచన దాస్, భువనేశ్వర్ ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యే సుశాంత రౌత్, భువనేశ్వర్ సెంట్రల్ ఎమ్మెల్యే అనంత నారాయణ జెనా, మాజీ మంత్రి అశోక్ చంద్ర పండా తదితర బీజేడీ నాయకులు పరామర్శ బృందంలో ఉన్నారు. హోం శాఖ బాధ్యతలను ముఖ్యమంత్రి నిర్వహిస్తున్నారు. రాష్ట్రంలో తరచు తలెత్తుతున్న సిగ్గుచేటు దాడులు వంటి నేరాలతో శాంతిభద్రతలు దిగజారినట్లు స్పష్టం అవుతుందని బీజేడీ పరామర్శ బృందం విచారం వ్యక్తం చేసింది.

- **వైద్య ఖర్చులు ప్రభుత్వం భరించాలి: హైకోర్టు**

ఠాణా పోలీసుల దాడిలో గాయపడి ఎయిమ్స్‌లో చికిత్స పొందుతున్న ఆర్మీ మేజర్ స్నేహితురాలి వైద్య ఖర్చులను ప్రభుత్వం భరించాలని రాష్ట్ర హైకోర్టు ఆదేశించింది. ఫిర్యాదు చేసేందుకు ఠాణాకు వెళ్లిన ఆమె విధి నిర్వహణలో ఉన్న సిబ్బందిపై దురుసుగా ప్రవర్తించిందనే ఆరోపణతో కేసు నమోదు చేసి అరెస్టు చేశారు.

ఈ కేసు విచారణ పురస్కరించుకుని బుధవారం రాష్ట్ర హైకోర్టు నిందిత యువతికి బెయిలు మంజూరు చేసింది. బెయిలు షరతులను దిగువ న్యాయస్థానం ఖరారు చేస్తుందని ఉన్నత న్యాయ స్థానం తెలిపింది. తదుపరి విచారణ ఈ నెల 26వ తేదీకి హై కోర్టు వాయిదా వేసింది. ఆమె వ్యతిరేకంగా పోలీసు చర్యలను రద్దు చేయాలనే అంశంపై విచారణ కొనసాగుతుంది.





ఆందోళనకు దిగిన మాజీ సైనికుల సమావేశం

### రత్న భాండాగారం లేజర్ స్కానింగ్ పూర్తి

భువనేశ్వర్: పూరీ శ్రీజగన్నాథుని రత్న భాండాగారం నిర్వహణ ప్రక్రియ చురుకుగా సాగుతోంది. నిపుణుల ప్రత్యక్ష పర్యవేక్షణలో అత్యంత ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఈ ప్రక్రియ కొనసాగుతోంది. దీనిలో భాగంగా భారత పురావస్తు శాఖ(ఏఎస్‌ఐ) అదనపు డైరెక్టర్ జనరల్ జన్‌విజ్ శర్మ ఆధ్వర్యంలో రత్న భాండాగారం లేజర్ స్కానింగ్ బుధవారం పూర్తి చేశారు. తర్వాత రాడార్ స్కానింగ్ నిర్వహణకు సన్నాహాలు చేస్తున్నట్లు రత్న భాండాగారం పర్యవేక్షణ ఉన్నత స్థాయి కమిటీ అధ్యక్షుడు జస్టిస్ విశ్వనాథ్ రథ్ తెలిపారు. ఈనెల 25వ తేదీ నాటికి ఈ ప్రక్రియ ముగించాలని నిపుణుల వర్గానికి సూచించినట్లు ఆయన పేర్కొన్నారు. లేజర్ స్కానింగ్ ప్రక్రియ సుదీర్ఘంగా 4 గంటల సేపు నిరవధికంగా కొనసాగిందని శ్రీమందిరం ప్రధాన పాలన అధికారి(సీఏఓ) డాక్టర్ అరవింద కుమార్ పాఢి తెలిపారు. ఈ ప్రక్రియలో 17 మంది నిపుణులు పాల్గొన్నారు. త్వరలో రత్న భాండాగారం మరమ్మతుల పనులు చేపడతారు. రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం అంచెలంచెలుగా అన్ని పనుల్ని పూర్తి చేస్తారు.



రత్న భాండాగారం పర్యవేక్షించిన నిపుణుల బృందం

## క్లుప్తంగా

### చెరువులో గల్లంతైన వ్యక్తి మృతి

విజయనగరం క్రైమ్: మండల పరిధిలోని సారిక గ్రామంలో గల చెరువులో ఈతకు వెళ్లిన ఐదుగురులో గల్లంతైన వ్యక్తి (తోట సూరిబాబు) మృతి చెందినట్లు రూరల్ ఎస్సై వి.అశోక్‌కుమార్ బుధవారం తెలిపారు. మంగళవారం సాయంత్రం గల్లంతు కాగా అప్పటి నుంచి పోలీసులు గజ ఈతగాళ్లచే గాలింపు చేపట్టగా బుధవారం మృతదేహం లభించింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అశోక్‌కుమార్ తెలిపారు.

### ఇంజినీరింగ్ విద్యార్థి ఆత్మహత్య


యోగీశ్వరరావు (ఫైల్)

రేగిడి: మండలంలోని ఏవీపురం గ్రామానికి చెందిన ఇంజినీరింగ్(బీటెక్) చదువుతున్న విద్యార్థి గోగుల యోగీశ్వరరావు(20) బుధవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటనపై ఎస్సై పి.నీలావతి తెలిపిన వివరాల ప్రకారం రాజాంలోని ప్రైవేట్ ఇంజినీరింగ్ కళాశాలలో యోగీశ్వరరావు బీటెక్ థర్డ్ ఇయర్ చదువుతున్నాడు. చదువులో వెనుకబడుతున్నాననే భావనతో మనస్తాపానికి గురై ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఇంటిపై ఉన్న రూమ్‌లో ఉరివేసుకున్నాడు. ఈ విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు కామినాయుడు, సత్యవతి గగ్గోలు పెట్టగా, చుట్టపక్కల ప్రజలు వచ్చి తలుపులు పగలగొట్టి యోగీశ్వరరావును కాపాడే ప్రయత్నం చేసినప్పటికీ అప్పటికే మృతిచెందాడు. స్థానికులు అందించిన సమాచారం మేరకు సంఘటనా స్థలానికి చేరుకుని, తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తుచేస్తున్నామని ఎస్సై తెలియజేశారు. యోగీశ్వరరావు మృతదేహాన్ని చూసేందుకు అతని స్నేహితులు తండోపతండాలుగా ఏవీపురం గ్రామానికి చేరుకున్నారు.

### శతాధిక వృద్ధుడి మృతి


వావిలపల్లి బంగారినాయుడు

రేగిడి: మండలంలోని బూరాడ గ్రామానికి చెందిన శతాధిక వృద్ధుడు వావిలపల్లి బంగారినాయుడు(101) అనారోగ్యంతో బుధవారం మృతిచెందారు. వారంరోజుల క్రితం వరకూ ఆయన ఆరోగ్యంగానే ఉండేవారు. ఇటీవల అనారోగ్యానికి గురై ఆస్పత్రిలో చికిత్స పొందారు. ఆయన 35 సంవత్సరాల పాటు బూరాడ గ్రామ పంచాయతీ సర్పంచ్‌గా సేవలు అందించారు. అన్ని వర్గాలు, పార్టీల మన్ననలు పొందారు. ప్రస్తుతం ఆయన కుమారుడు వావిలపల్లి జగన్మోహనరావు రేగిడి మండల వైస్ ఎంపీపీగా, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రేగిడి మండల అధ్యక్షుడిగా ఉన్నారు. ఆయన మృతి పట్ల వైఎస్సార్‌సీపీ కేంద్ర పాలకమండలి సభ్యుడు పాలవలస రాజశేఖరం, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, వైఎస్సార్‌సీపీ రాజాం ఇన్‌చార్జి డాక్టర్ తలే రాజేష్, ఎంపీపీ దార అప్పలనరసమ్మ, వైస్ ఎంపీపీ టంకాల అచ్చెన్నాయుడు తదితరులు జగన్మోహనరావును కలిసి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

### చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

రామభద్రపురం: మండలకేంద్రంలోని వసంతల వీధికి చెందిన ఓ వ్యక్తి విశాఖపట్నంలోని కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందాడు. ఈ సంఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల మేరకు వసంతుల వీధికి చెందిన పూడి చంద్రశేఖర్(38) కొంత కాలం నుంచి ఫిట్స్ వ్యాధితో పడుతుండేవాడు. దీంతో మనస్తాపానికి గురై మంగళవారం ఉదయం బాత్‌రూమ్‌కు వినియయోగించే యాసిడ్ తాగి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. గమనించిన కుటుంబసభ్యులు ప్రథమ చికిత్స నిమిత్తం బాడంగి సీహెచ్‌సీకి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం విశాఖలోని కేజీహెచ్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతునికి భార్య రాజేశ్వరి, కుమార్తె రిత్విక, మోక్షిత్ ఉన్నారు. మృతుని తమ్ముడు మురళీకృష్ణ ఫిర్యాదుమేరకు ఏఎస్సైరమణ కేసునమోదు చేశారు.

### పశువుల శాలకు నిప్పుపెట్టిన దుండగులు

గంట్యాడ: మండలంలోని వసంత గ్రామంలో చలుమూరి అప్పారావుకు చెందిన పశువుల శాలకు మంగళవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటించారు. దీంతో శాల కాలి బూడిదైంది. శాల బయటకట్టి ఉన్న ఆవు పొట్టపై నిప్పురవ్వలు పడడంతో కొంత మేర ఆవుకు గాయాలయ్యాయి. గతంలో కూడా ఇదే ప్రాంతంలో గుర్తు తెలియని వ్యక్తులు పశువులశాలకు నిప్పు పెట్టడంతో రెండు ఆవులు చనిపోయాయి.

### అంగన్‌వాడీలకు మెమోలు జారీ

విజయనగరం ఫోర్ట్: అంగన్‌వాడీలకు వచ్చే పిల్లలకు మధ్యాహ్నం 12 గంటల వరకు వంట చేయలేదనే అంశంపై 'అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆకలి కేకలు' అనే శీర్షికన 'సాక్షి'లో శుక్రవారం ప్రచురితమైన కథనానికి ఐసీడీఎస్ అధికారులు స్పందించారు. ఆయా అంగన్‌వాడీ కేంద్రాల సిబ్బందికి మెమోలు జారీ చేసినట్టు సీడీపీఓ ప్రసన్న తెలిపారు.

### పోస్టర్ ఫ్రీ నగరంగా తీర్చిదిద్దుదాం

విజయనగరం: పోస్టర్ ఫ్రీ నగరంగా తీర్చిదిద్దేందుకు ప్రతిఒక్కరూ సహకరించాలని విజయనగరం కార్పొరేషన్ కమిషనర్ పల్లి నల్లనయ్య బుధవారం ఓ ప్రకటనలో కోరారు. నగర పరిధిలో ఎక్కడా పోస్టర్లు, గోడలపై రాతలు చేపట్టరాదన్నారు. పోస్టర్లు అతికించేవారి నుంచి రూ.5వేలు అపరాధ రుసుం వసూలు చేస్తామని హెచ్చరించారు. నిబంధనలు అతిక్రమించి పోస్టర్లు అతికించిన సంస్థ నుంచి రూ.5వేలు అపరాధ రుసుము విధించి వసూలు చేశామని చెప్పారు.





# గంగమ్మ ఒడిలోకి.. గణపయ్య..



వినాయక నవరాత్రి ఉత్సవాల సందర్భంగా గణపతి ప్రతిమలను బుధవారం రాత్రి నాగావళి నదిలో నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా యువత సందడి చేశారు.

– శ్రీకాకుళం కల్చరల్







## అదరగొట్టిన అక్కాచెల్లెళ్లు

- అంతర్జాతీయ వేదికపై సత్తా చాటిన వెయిట్ లిఫ్టర్లు
- కామన్‌వెల్త్ చాంపియన్‌షిప్‌లో పతకాలు


సాధించిన పతకాలను చూపిస్తున్న బెల్లాన హారిక, భార్గవి

నెల్లిమర్ల రూరల్: వెయిట్ లిఫ్టింగ్ అంటే ఠక్కున గుర్తొచ్చే ఊరి పేరు నెల్లిమర్ల మండలంలోని కొండవెలగాడ. ప్రతిభ ఉంటే వేదికతో సంబంధం లేదని నిరూపిస్తున్నారు ఆ గ్రామానికి చెందిన క్రీడాకారులు. పలు జాతీయ, అంతర్జాతీయ వేదికలపై సత్తా చాటి పతకాలు సాధిస్తూ జిల్లా, గ్రామం పేరును ఇనుమడిస్తున్నారు. ఈ నెల 16 నుంచి 20 వరకు ఫిజీ దేశంలో జరుగుతున్న యూత్ జూనియర్ అండ్ సీనియర్ కామన్‌వెల్త్ పోటీల్లో కొండవెలగాడకు చెందిన బెల్లాన శ్రీను, గౌరీ దంపతుల కుమార్తెలు బెల్లాన భార్గవి, హారిక ఆంధ్రప్రదేశ్ తరఫున పాల్గొన్నారు. ఈ క్రమలో మంగళవారం రాత్రి జరిగిన పోటీల్లో భార్గవి 49 కేజీల విభాగంలో స్నాచ్ 69 కిలోలు, క్లీన్ అండ్ జెర్క్ 86 కిలోలు మొత్తం 155 కిలోల బరువును ఎత్తి రజత పతకాన్ని కైవసం చేసుకుంది. అలాగే బుధవారం జరిగిన పోటీల్లో హారిక 64 కేజీల విభాగంలో స్నాచ్ 81 కిలోలు, క్లీన్ అండ్ జెర్క్ 105 కిలోలు మొత్తం 186 కేజీల బరువును ఎత్తి రెండు రజత పతకాలను దక్కించుకుంది. అంతర్జాతీయ వేదికపై సత్తా చాటిన అక్కాచెల్లెళ్లను రాష్ట్ర వెయిట్ లిఫ్టింగ్ అసోషియేన్ ప్రెసిడెంట్ నీలంశెట్టి శ్రీలక్ష్మి, జిల్లా అసోసియేషన్ ప్రెసిడెంట్ లక్క కార్యదర్శి చల్లా రాము, కోచ్ వల్లూరి శ్రీనివాసరావు, తదితరులు అభినందించారు.

## స్కూల్ గేమ్స్ ఫుట్‌బాల్ పోటీలకు జిల్లా జట్లు సిద్ధం


రాష్ట్రస్థాయి స్కూల్‌గేమ్స్ ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికైన జిల్లా క్రీడాకారులు

విజయనగరం: రాష్ట్రస్థాయిలో జరగనున్న స్కూల్ గేమ్స్ ఫుట్‌బాల్ పోటీలకు జిల్లాస్థాయిలో నిర్వహించిన ఎంపిక పోటీలకు అనూహ్య స్పందన లభించింది. జిల్లా స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో బుధవారం జిల్లా కేంద్రంలోని రాజీవ్ స్టేడియంలో నిర్వహించిన పోటీలను జిల్లా క్రీడాప్రాధికార సంస్థ అధికారి ఎస్.వెంకటేశ్వరరావు ప్రారంభించారు. అండర్-14,17 వయస్సుల విభాగాల్లో బాల, బాలికలకు నిర్వహించిన ఎంపిక పోటీలకు జిల్లా నలుమూలల నుంచి 350 మంది క్రీడాకారులు హాజరయ్యారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉత్కంఠ భరితంగా సాగిన పోటీల్లో అండర్-14 బాలుర జట్టుకు 11 మంది క్రీడాకారులు, బాలికల జట్టుకు 11 మంది క్రీడాకారులు ఎంపికయ్యారు. అదేవిధంగా అండర్-17 విభాగంలో బాలుర జట్టుకు 11 మంది క్రీడాకారులు, బాలికల జట్టుకు 11 మంది క్రీడాకారులు అర్హత సాధించారు. అండర్-14 విభాగంలో ఎంపికైన క్రీడాకారులు సత్యసాయి జిల్లాలో జరగనున్న రాష్ట్ర స్థాయి స్కూల్‌గేమ్స్ పోటీల్లో, అండర్-17 విభాగంలో ఎంపికైన క్రీడాకారులు పల్నాడులో జరగనున్న అంతర్‌జిల్లాల పోటీల్లో విజయనగరం జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించనున్నారు. ఎంపిక పోటీలను జిల్లా స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ప్రతినిధులతో పాటు పలువురు వ్యాయామ ఉపాధ్యాయులు పర్యవేక్షించారు.

## క్రీడల్లో రాణించేవారికి ఉజ్వల భవిత

పూసపాటిరేగ: క్రీడల్లో రాణించే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని ఎంఈఓలు ఎ.రాజ్‌కుమార్, బి.పాపినాయుడు అన్నారు. మండలంలోని వెంపడాం జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాల క్రీడా మైదానంలో స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) మండలస్థాయి క్రీడాపోటీలను వారు లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడల్లో రాణించిన విద్యార్థులు ప్రభుత్వ కొలువులు సాధిస్తున్నారన్నారు. గ్రామీణ క్రీడాకారుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు మండల స్థాయి క్రీడలు దోహదపడతాయన్నారు. మొదటిరోజు అథ్లెటిక్స్, కబడ్డీ, యోగా పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం లక్ష్మయ్య, వెంపడాం, కొవ్వాడ సర్పంచ్‌లు పిన్నింటి కుమార్, కోట్ల రఘు, మాజీ సర్పంచ్ పిన్నింటి శ్రీనివాసరావు, ఎల్లం నాయుడు, కొరటాన చినఅప్పలనాయుడు, వాళ్లె అప్పలనాయుడు, పి.సీతంనాయుడు, రాము నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

### ఎస్పీని కలిసిన విజిలెన్స్ ఎస్పీ


ఎస్పీ వకుల్ జిందాల్‌కు పూలమొక్కను అందజేస్తున్న విజిలెన్స్ ఎస్పీ బర్ల ప్రసాదరావు

విజయనగరం క్రైమ్: విజయనగరం జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్‌ను శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, విజయనగరం జిల్లాల విజిలెన్స్ ఎస్పీగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన బర్ల ప్రసాదరావు బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. పూలమొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. 1989వ బ్యాచ్ సబ్ ఇన్స్పెక్టర్‌గా పోలీసుశాఖలో అడుగుపెట్టిన బర్ల ప్రసాదరావు శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ రూరల్, విశాఖ సిటీలో వివిధ హోదాల్లో పనిచేశారు. రాష్ట్ర డీజీపీ కార్యాలయంలోని టెక్ టవర్స్, కోస్టల్ సెక్యూరిటీ, విశాఖ సిటీలో ఏసీపీగా, అదనపు ఎస్పీగా పనిచేసి, ఇటీవల నాన్ క్యాడర్ ఎస్పీగా ఉద్యోగోన్నతి పొందారు.

### స్వచ్ఛత హి సేవలో..


భోగాపురం గంగరాల చెరువుగట్టుపై చెత్త తొలగింపులో కలెక్టర్, ఎమ్మెల్యే

భోగాపురం: ప్రజల భాగస్వామ్యంతో స్వచ్ఛత హి సేవ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అన్నారు. భోగాపురంలోని గంగరాల చెరువు గట్టుపై బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. చెరువు గట్టుపై పేరుకుపోయిన చెత్తను, పిచ్చి మొక్కలను తొలగించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పరిశుభ్రమైన, స్వచ్ఛమైన గ్రామాలే లక్ష్యంగా నిర్వహిస్తున్న కార్యక్రమంలో ప్రతిఒక్కరూ భాగస్వామ్యం కావాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే లోకం నాగమాధవి, తదితరులు పాల్గొన్నారు.

## పత్తి కొనుగోలుకు ఏర్పాట్లు చేయాలి

- జేసీ సేతుమాధవన్


సమావేశంలో మాట్లాడుతున్న జేసీ సేతు మాధవన్

విజయనగరం ఫోర్ట్: జిల్లాలో నవంబర్ రెండో వారం నుంచి పత్తి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని జాయింట్ కలెక్టర్ ఎస్.సేతుమాధవన్ అధికారులను ఆదేశించారు. తన చాంబర్‌లో పత్తి కొనుగోలుపై బుధవారం సమీక్షించారు. జిల్లాలో సుమారు 1574 హెక్టార్లలో పత్తిపంట సాగవుతోందని, ఈ నెల 23లోగా ఈ క్రాప్ నమోదు పూర్తిచేయాలని ఆదేశించారు. రాజాం, రామభద్రపురంలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్టు వెల్లడించారు. ఈ ఏడాది క్వింటాకు రూ.7,521గా మద్దతు ధరను కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా నిర్ణయించిందన్నారు. తేమశాతం నిర్ణీత 8 శాతం కంటే ఎక్కువగా ఉంటే మద్దతు ధర క్రమంగా తగ్గుతుందని తెలిపారు. తేమ 12 శాతం కంటే ఎక్కువగా ఉంటే కొనుగోలు చేయడం కుదరదని స్పష్టంచేశారు. రైతులు పత్తిలో తేమశాతం తక్కువగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. రైతులందరూ ప్రభుత్వ కొనుగోలు కేంద్రంలో పత్తి విక్రయాలు జరిపి మద్దతు ధర పొందాలన్నారు. జిల్లాలో ఈ ఏడాది సుమారు 1900 మెట్రిక్ టన్నుల పత్తి పండే అవకాశం ఉందన్నారు. సమావేశంలో మార్కెటింగ్ ఏడీ బి.రవికుమార్, జిల్లా వ్యవసాయ అధికారి వి.తారకరామారావు, జిల్లా అగ్నిమాపక అధికారి బి.రామ్‌ప్రమాస్, లీగల్ మెట్రాలజీ అసిస్టెంట్ కంట్రోలర్ పి.వి. రంగారెడ్డి, ఆర్డీఓ ఎస్.వి.రమణ, తదితరులు పాల్గొన్నారు.

## 15 కిలోల గంజాయి స్వాధీనం


నిందితులను విలేకరుల ముందు ప్రవేశపెట్టిన డీఎస్పీ శ్రీనివాసరావు

మెరకముడిదాం: మండలంలోని గాదెలమర్రివలస గ్రామం జంక్షన్ లో గంజాయితో పట్టుబడిన ఆరుగురు నిందితులను అరెస్ట్ చేసినట్లు బొబ్బిలి డీఎస్పీ శ్రీనివాసరావు బుధవారం తెలిపారు. ఈ మేరకు ఆయన స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడుతూ బుదరాయవలస ఇన్‌చార్జ్ ఎస్సై బి.లోకేశ్వరరావు సిబ్బందితో వాహనాల తనిఖీ చేస్తుండగా సిగిరివెంకటేష్, జరజాన శ్రీరామ్, బైక్‌పై వస్తుండగా వారిని ఆపి రికార్డులు గురించి ఆరా తీస్తున్నారు. అదే సమయంలో వెనకనుంచి ఆటోలో వస్తున్న నలుగురు వ్యక్తులు ఆటో దిగి పరుగు తీశారు. ఇది గమనించిన పోలీసులు వెంటనే స్పందించి ఆ నలుగురిని పట్టుకుని ఆటో తనిఖీ చేయగా గంజాయి పట్టుబడింది. ఆటోలో గంజాయిని తరలిస్తున్న వెంకటేష్ (రంగపువలస) జరజాన శ్రీరామ్ (పెరుమాళి) అలాగే పాచిపెంట మండలం ఏసుపురం గ్రామానికి చెందిన పిడిసి చిన్నారావు, రాజాం మండలం ఒమ్మి గ్రామానికి చెందిన ఒప్పింటి నాగరాజు, మెరకముడిదాం మండలం గాదెలమర్రివలస గ్రామానికి చెందిన వలిరెడ్డి సత్యనారాయణలను అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ శ్రీనివాసరావు వివరించారు. నిందితుల దగ్గర 15 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని, ఒక బైక్, ఒక ఆటోను సీజ్ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో చీపురుపల్లి సీఐ శంకర్రావు, బుదరాయవలస ఇన్‌చార్జ్ ఎస్సై బి.లోకేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

## 3 అక్రమ ఇసుక ట్రాక్టర్ల పట్టివేత


అక్రమ ఇసుక రవాణా చేస్తూ పట్టుబడిన ట్రాక్టర్లు

బొబ్బిలిరూరల్: మండలంలోని అలజంగి గ్రామం వద్ద వేగావతి నది నుంచి అక్రమంగా ఇసుకను రవాణా చేస్తున్న 3 ట్రాక్టర్లను పోలీసులు పట్టుకున్నారు.మంగళవారం అర్ధరాత్రి అలజంగిగ్రామం నుంచి బొబ్బిలికి ఇసుకను ట్రాక్టర్ల ద్వారా తరలిస్తున్నారన్న సమాచారాన్ని తెలుసుకున్న పోలీసులు గొల్లపల్లి వద్దనున్న స్థానిక దాడితల్లి అమ్మవారి గుడి సమీపంలో ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను గుర్తించి వాటిని స్వాధీనం చేసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.బుధవారం తహసీల్దార్‌కు విషయం తెలియజేయగా ఆయన మొదటిసారిగా దొరికిన రెండు ట్రాక్టర్లకు రూ.10వేలు చొప్పున, రెండోసారి దొరికిన ఓ ట్రాక్టర్‌కు రూ. 20వేలు మొత్తం రూ.40వేలు జరిమానా విధించారు. మరో మారు ఇసుక అక్రమ రవాణాలో దొరికితే ఆర్‌సీ రద్దుచేస్తామని తహసీల్దార్ శ్రీను స్పష్టం చేశారు.